

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల
కేయూ పరిధిలోని డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి శనివారం విడుదల చేశారు.
- 10లో▸



కొండగట్టుకు తరలిన స్వాములు
హనుమాన్ మాలధారులు శనివారం ఇరుముడి ధరించి కొండగట్టుకు బయల్దేరారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదానం చేశారు.
- 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
44^0 /28^0

వాతావరణం
జిల్లాలో ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది. రాత్రిళ్లు ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 మాసాల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులు ఈ నెల 14లోపు www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉండాలని తెలిపారు. అర్హులైన వారికి ఈనెల 21న సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉదయం 11.00 నుంచి 1.00 గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

బ్యాటరీల అపహరణ

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ పంచాయతీ పరిధి శ్మశాన వాటికలో సోలార్ దీపాల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. కొద్ది రోజుల క్రితం శ్మశాన వాటికలో రూ.1.60 లక్షలతో సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. కాగా.. అవి రెండ్రోజుల క్రితం నుంచి వెలుగడం లేదు. శనివారం అటుగా వెళ్లిన గ్రామపంచాయతీ పాలకులు సోలార్ దీపాల్లోని రెండు బ్యాటరీలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బ్యాటరీల అపహరణపై సర్పంచ్ కవితారవి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల

చెన్నారావుపేట: జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోని ఆత్మహత్యతో తోటి ఉద్యోగులు శుక్రవారం రాత్రి నర్సంపేటలోని పోస్ట్‌మార్టం వద్ద ఆందోళన చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌కు 20 మంది జూనియర్ కార్యదర్శులను తరలించారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా కార్యదర్శులతో రాయించుకొని విడుదల చేసినట్లు సమాచారం.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



నర్సంపేట రూరల్: మండలంలోని ముత్తోజిపేట శివారులోని రేక కొమురయ్య తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కొమురయ్యగౌడ్‌ను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ మండ మహేందర్, గౌడ సంఘం అధ్యక్షుడు దూపటి అధ్యక్షుడు బాబు, పోశాల లక్ష్మీనారాయణ, గాదెగోని కుమారస్వామి, వార్డు సభ్యులు చిట్టి రమేశ్, చిట్టి కుమార్, ఆనంద్, పాల్గొని పరామర్శించారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సైక్లిస్ట్‌కు గాయాలు

వరంగల్ (పర్వతగిరి): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని చౌటపల్లికి చెందిన జంపయ్య వాటర్‌క్యాన్‌తో పాటు గడ్డిమోపు సైకిల్‌పై పెట్టుకుని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పర్వతగిరి బైక్‌పై వెళ్తున్న శరత్ అతివేగంగా వచ్చి జంపయ్యను ఢీ కొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. శరత్‌కు సైతం గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అమ్మే.. అనంతం!



- ఫొటో : పెద్దపల్లి వరప్రసాద్, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ఈ లోకంలో నువ్వు ద్వేషించినా..
నిన్ను ప్రేమించే వాళ్లు ఉన్నారంటే
అది అమ్మమాత్రమే
కనిపించే దైవం..
కని పెంచే మాతృమూర్తి
అంతులేని అనురాగం అమ్మ..

బొడ్డు తాడును పేని.. కడుపు ఊయలలో మోసి ఊపిరిపోసింది. ప్రేమను కలిపి గోరుముద్దలు తినిపించి సత్తువై నిలిచింది. చెట్టులా నిలబడి బతుక్కు నీడనిచ్చింది. ఆకాశమై గొడుగు పట్టి.. వాన చినుకై వసంతాన్ని చూపింది. అ.. అంటే అమ్మ.. ఆమె ప్రేమ అనంతం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కుటుంబ పెద్ద వదిలివెళ్లినా దివ్యాంగులైన పిల్లలను కంటికి రెప్పలా కాపాడుతున్న తల్లి. అనాథ యువతికి అన్నీ తామైన అధికారులు. భర్త తనువు చాలించినా.. బతుకుల్ని నిలబెట్టిన మరో మాతృమూర్తి. వీరి ప్రేమానురాగాలు పదాలకందనివి. భావాలకు పొదగనివి. నేడు మాతృ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు.



- వృత్తికి, మాతృత్వానికి న్యాయం చేస్తున్న వనితలు
- భర్త దూరమైనా పిల్లల్ని సాకుతున్న ఆదర్శమూర్తులు

నేడు మాతృ దినోత్సవం

ఈ అమ్మకు సలాం

జనగామ: మానసిక వ్యాధితో జన్మించిన కవలలను వదిలేసి ఇంటి పెద్ద వెళ్లిపోయాడు. ఒంటరైన తల్లి తన కూతుళ్లను పెంచి పెద్ద చేసింది. 22 ఏళ్లుగా మానసిక ఎదుగుదల లేని పిల్లలను కంటి పాపల్లా కాపాడుతోంది జనగామ పట్టణంలోని గుండ్లగడ్డకు చెందిన ఆమంచ రమ. కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రమ, రాజు దంపతులకు 2001లో కవల(ఆడపిల్లలు)లు అఖిల(22), నిఖిల(22) జన్మించారు. వీరిలో ఎదుగుదల కనిపించకపోవడంతో భవిష్యత్‌లో ఆరోగ్యవంతులు అయ్యే అవకాశం లేదని డాక్టర్లు చెప్పారు. ఆందోళన చెందిన రాజు ఇంటినుంచి పారిపోయాడు. రమ మనోస్థైర్యం కోల్పోకుండా.. ఇద్దరు కూతుళ్లను తీసుకుని అద్దె ఇంట్లోకి మారింది. కడుపు మాడ్చుకుని పిల్లలకు కష్టం కలుగకుండా చూసుకుంటోంది. పిల్లలకు వచ్చే పింఛన్‌తోపాటు తన బీడీ పింఛన్‌తో వారికి వైద్యం చేయిస్తోంది. ఎదిగిన కూతుళ్లకు సేవ చేస్తూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న రమ ప్రభుత్వ సాయం కోరుతోంది.



మానసిక దివ్యాంగులైన కూతుళ్లకు అన్నం తినిపిస్తున్న తల్లి రమ

అమ్మతో గడిపిన ప్రతీక్షణం ఆనందమే..



- నేను ఏం చేసినా సపోర్ట్ చేసేది
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: 'నేను చిన్నతనంలో చాలా అల్లరి చేసేవాడిని. తెలిసీ తెలియక ఆకతాయి పని చేసినా మా అమ్మ వెనకేసుకు వచ్చేది. ఆమెతో గడిపిన ప్రతిక్షణం తీపి గుర్తు. అదో ఆనందం' అని అంటున్నారు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్. మదర్స్ డే సందర్భంగా ఆయనను 'సాక్షి' పలకరించగా తన బాల్యం, తల్లి విజయలక్ష్మితో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఐదో తరగతి వరకు నల్లగొండలో చదివాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో చదివాను. నేను చేసే పనులను మా అమ్మ బలంగా నమ్మేది. అబద్ధం ఆడడు అనే నమ్మకం నాపై ఎక్కువగా ఉండేది. నేను ఎదుగుతున్నా కొద్దీ ఆ నమ్మకం మరింత పెరిగింది. చిన్నతనంలో నేను గొడవలను ఇంటిపైకి తెచ్చినా.. నన్ను ఎప్పుడూ నిందించలేదు. దానికి గల కారణాలను తెలుసుకొని అక్కున చేర్చుకునేది. నన్ను నిందించిన, దండించిన సందర్భాలు లేవని చెప్పొచ్చు.

అమ్మ స్ఫూర్తితోనే పోలీస్ అధికారిగా..

నన్ను పోలీస్ అధికారిగా చూడాలన్నది మా అమ్మ బలమైన కోరిక. నలుగురికి సహాయం చేయడానికి అధికారం ఉండాలని, పేదల పక్షాన నిలబడాలని సూచించేది. మా తండ్రి సుబ్బయ్య ఐఏఎస్ అధికారి. ఇప్పుడు రిటైర్ అయ్యారు. అయితే ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేసేవారు. ఎక్కడ పనిచేసినా.. మా అమ్మ పాత్ర చాలా కీలకంగా ఉండేది. కుటుంబంలో ఎవరి అవసరాలు ఏమిటి అనేది చెప్పకున్నా.. ఆమెకు తెలిసేవి. ఏ సమయంలో ఎవరికి ఏం చేయాలో చాలా బాగా అర్థమయ్యేది. నేను 2000 సంవత్సరం మే నెలలో డీఎస్పీగా కొత్తగూడెంలో ఉద్యోగంలో చేరాను. ఆ సమయంలో నన్ను యూనిఫాంలో చూసి చాలా మురిసిపోయింది. నా దురదృష్టం మా అమ్మ నా ఎదుగుదలను పూర్తిగా చూడకుండానే 2000 జూన్‌లో కాలం చేశారు. నా జీవితంలో అతి పెద్ద లోటు అదే. మా తండ్రి ఇప్పటికీ మాతోనే ఉంటారు.

తల్లిదండ్రులను ప్రేమించని వారు జంతువులే

పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడతారు. వారి జీవితాన్ని ధారపోసి పిల్లల ఉన్నతికి తోడవుతారు. అలాంటి తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. తల్లిదండ్రులు లేని వారికి వారి విలువ తెలిసినంతగా ఉన్న వారికి తెలియదు. అసలు తల్లిదండ్రులను ప్రేమించని వారు నా దృష్టిలో జంతువుతో సమానం.

భర్త దూరమై.. బతుకు భారమైనా..

తొర్రూరు: భర్త దూరమైనా, బతుకు భారమైనా.. జన్మనిచ్చిన సంతానానికి అన్నీ తానైంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన తోట నాగయ్య, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. భూమి లేని ఆ దంపతులు కూలీ చేసి కుటుంబాన్ని పోషించుకునేవారు. 1994లో భర్త మృతి చెందాడు. ఆ సమయంలో కుమారుడు వెంకన్నకు ఏడేళ్లు, కుమార్తె మమతకు మూడేళ్లు. ఈక్రమంలో కుటుంబ భారాన్ని తనపై వేసుకుని పిల్లలను ఉన్నతంగా చదివించింది. వెంకన్న ఓయూలో ఎమ్మెస్సీ(జాగ్రఫీ) పూర్తి చేశాడు. మమత కేయూలో ఎమ్మెస్సీ (బాటనీ) పూర్తి చేసింది. వెంకటమ్మ కూలీ పనిచేసి కుమార్తె వివాహాన్ని జరిపించింది. తల్లి కష్టాన్ని చూసిన వెంకన్న రెండు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అనంతరం 2015లో రిజర్వ్ ఎస్సైగా వరంగల్‌లో ఉద్యోగం పొందారు. ప్రస్తుతం ఆర్ఐగా నల్లగొండ జిల్లాలో పని చేస్తున్నారు.



మాతృత్వపు ఉషోదయం



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మిడ్‌వైఫ్‌గా విధులు నిర్వహిస్తున్న ఉషారాణి వెయ్యికి పైగా సుఖ ప్రసవాలు చేశారు. విధుల్లో భాగంగా ప్రసవాలు చేయడమంటే బిడ్డకు జన్మనిచ్చినట్లుగా ఆమె భావిస్తున్నారు. వైద్యుల సహకారంతో తన చేతుల మీదుగా జరిగే ప్రతీ ప్రసవం ఓ తీపి గుర్తుగా మిగిలిపోతుందని ఆమె చెబుతున్నారు. 'మా ఆస్పత్రికి వచ్చే ప్రతి గర్భిణికి సుఖప్రసవంపై అవగాహన కల్పిస్తున్నాను. వారికి ఒక తల్లిగా, తోబుట్టువుగా, బంధువుగా సేవ లందించడం అదృష్టంగా భావిస్తున్నా' అని డాక్టర్ ఉషారాణి చెబుతున్నారు.

అధికారులే అమ్మా, నాన్నలై..



పక్క ఫొటో చూడండి.. అప్పగింతల దృశ్యం మనకు కనిపిస్తుంది. కూతురును అత్తగారికి అప్పగిస్తున్న ఓ తల్లి తన కూతురును అత్తగారి చేతుల్లో పెట్టి ఏ లోటూ లేకుండా చూసుకోవాలని, ఎంతో అల్లారుముద్దుగా పెరిగిందని చెబుతూ కన్నీటిపర్యంతమైంది. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా.. ఆ యువతి అనాథ. చిన్నప్పటి నుంచి ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని బాల సదనంలో పెరిగింది. అధికారులే అమ్మానాన్నలై ఆ యువతి వివాహం చేశారు. అప్పగింతల తంతు జరిపించారు.

అనాథ యువతికి వివాహం చేసిన 'ఐసీడీఎస్'

శాయంపేట/కాజీపేట అర్బన్ : ఆ బాలికకు తల్లిదండ్రులు లేరు. అనాథగా చిన్నప్పటి నుంచి ప్రభుత్వ బాలికా సదనంలో ఆశ్రయం పొంది చదువుకుంది. ఓ యువకుడు ఆ అనాథ అమ్మాయిని వివాహం చేసుకుంటానని ముందుకురాగా.. ఐసీడీఎస్ అధికారులే అమ్మానాన్నలై దగ్గరుండి వారి వివాహం జరిపించారు. కరీంనగర్ జిల్లా మెతుకపల్లికి చెందిన కర్నకంటి రమ్య తల్లిదండ్రులు 2004లో చనిపోయారు. రమ్య కరీంనగర్‌లోని ప్రభుత్వ బాలికా సదనంలో నాలుగో తరగతిలో చేరి వసతి పొందింది. అప్పటి నుంచి రమ్య ఆలనా పాలనా అధికారులే చూసుకుంటున్నారు. ఈక్రమంలో శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన వినయ్ తాను అనాథ అమ్మాయిని వివాహం చేసుకుంటానని ముందుకు వచ్చి ఐసీడీఎస్ అధికారుల అనుమతి తీసుకున్నాడు. రమ్యకు తల్లిదండ్రులు లేని లోటు తెలియకుండా ఐసీడీఎస్ అధికారులే ఐదు రోజుల పెళ్లి తంతు జరిపించారు. మెహందీ, మంగళస్నానం, పెళ్లి కూతురు తయారీ తదితర కార్యక్రమాలు అధికారులే స్వయంగా కొనసాగించారు. ఈనెల 11న గురువారం వినయ్, రమ్యల వివాహాన్ని ఐసీపీఎస్ యూనిట్ అధికారులంతా తరలివచ్చి అమ్మాయి తరఫు బంధువులుగా జరిపించారు. స్థానికులు సవిత శ్రీధర్ దంపతులు మట్టెలు, మంగళసూత్రాలు చేయించి కన్యాదానం చేశారు.

అమ్మకు నీరాజనం
- అనాథ పిల్లలు, వృద్ధులకు అండగా
- ఆశ్రమాల స్థాపనతో అమ్మసేవ

- 10లో▸

మంచినీళ్లు అనుకుని..

- టర్పెంట్ ఆయిల్ తాగి చిన్నారి మృతి
- పెళ్లింట విషాదం..



సౌమ్య (ఫైల్)

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం జాఫర్‌పల్లికి చెందిన మంచాల స్వామి–అఖిల దంపతుల ఏడాదిన్నర కుమార్తె మంచినీళ్లు అనుకుని టర్పెంట్ ఆయిల్ తాగి శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వామి– అఖిల దంపతులకు రెండున్నరేళ్ల కుమారుడు, కుమార్తె సౌమ్య (18నెలలు) ఉన్నారు. అఖిల చెల్లి వివాహం ఈనెల 12న నర్సంపేట మండలం బాంజీపేటలో ఉండడంతో 8వ తేదీనే వెళ్లింది. ఈక్రమంలో ఈనెల 11న ఇంట్లో కలర్‌లు వేస్తుండగా చిన్నారి సౌమ్య ఆడుకుంటూ వెళ్లి కలర్‌లో కలిపే టర్పెంట్ ఆయిల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి సౌమ్య మృతి చెందింది. ఈ మేరకు నర్సంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారమే అఖిల చెల్లెలి పెళ్లి జరగాల్సి ఉండగా.. పాప మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. స్వగ్రామం జాఫర్‌పల్లి విషాదఛాయలు అలుముకున్నాయి. పాప తల్లిదండ్రులు స్వామి, అఖిల రోదనలు పలువురిని కంటతడిపెట్టిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. అఖిల సోదరి వివాహం పరకాల సమీపంలోని ఓ ఆలయంలో జరిపించినట్లు సమాచారం.

తాపీమేస్త్రీల ఆర్థికసాయం..

చిన్నారి తండ్రి స్వామి తాపీమేస్త్రీ కావడంతో సహచర మేస్త్రీలంతా కలిసి శనివారం స్వామిని పరామర్శించారు. రూ.7,900సాయం అందించారు. కార్యక్రమంలో తాపీమేస్త్రీల సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్ల కొంరయ్య, ముదుసు మొగిలి, పులి రవి, రమేశ్, బొజ్జ సంపత్, దాసరి రాజు, రాంబాబు, యాపచెట్టు బాబు, ఎర్రోళ్ల దయాకర్ పాల్గొన్నారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు ఘన స్వాగతం



బండా ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

దుగ్గొండి: తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి శనివారం మండలంలోని రేకంపల్లికి వచ్చారు. మొదటిసారి మండలానికి రావడంతో ఆయనకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, ముదిరాజ్ సంఘం నాయకులు పల్లెబోయిన అశోక్, పొన్నం మొగిలి, సర్పంచ్ ఇమ్మడి యుగంధర్‌యాదవ్, ఎంపీటీసీ సోనిరతన్, శంకేశి కమలాకర్, బూర చందూగౌడ్, మంద శ్రీనివాస్ ఉన్నారు.

మడిగెలపై విచారణ

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో కవర్‌షెడ్‌లోని ఫ్లాట్లతో పాటు ఓపెన్ ప్లాట్ల కేటాయింపులపై వరంగల్ మార్కెట్ కమిటీ అధికారులు గ్రేడ్–2 సెక్రటరీ బియాబానీ, సహాయ కార్యదర్శులు జన్ను భాస్కర్, లా షరీఫ్ శనివారం విచారణ జరిపారు. ప్లాట్ల కేటాయింపుల సందర్భంగా ఆర్థికపరమైన లావాదేవీలు జరిగాయని, అలాంటి వారికే కేటాయింపులు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. విచారణలో గతంలో గుర్తింపు కార్డులు ఉన్నా.. తమకు మోడల్ మార్కెట్‌లో మడిగెలు ఇవ్వలేదని కొంతమంది, కవర్‌షెడ్ చుట్టూ చిల్లర దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల గిరాకీ లేనందున అద్దెలు కట్టలేకపోతున్నామని, అద్దెలు తగ్గించాలని కొంత మంది వ్యాపారులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు గ్రేడ్–2 సెక్రటరీ బియాబానీ తెలిపారు. మరో రెండ్రోజుల పాటు విచారణ జరిపి నివేదిక అందిస్తామని తెలిపారు.

ముగిసిన జేపీఎస్ సోని అంత్యక్రియలు

- ఉద్రిక్త వాతావరణంలో అంతిమయాత్ర
- పోలీసుల భారీ బందోబస్తు

నర్సంపేట రూరల్: టెన్షన్.. టెన్షన్‌గా, భారీ బందోబస్తు నడుమ పంచాయతీ కార్యదర్శి సోని అంతిమ యాత్ర ముగిసింది. వరంగల్ జిల్లా నర్సంపేటలోని బైరి (రంగు) సోని (31) ఖానాపురం మండలంలోని రంగాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న విషయం పాఠకులకు విదితమే. శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోని స్వగృహం వద్దకు చేరుకుని తక్షణమే సోని కుటుంబానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇవ్వాలని, కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ అంతిమయాత్ర ఎదుట కూర్చోవడంతో ఈస్ట్ జోన్ డీసీపీ కర్ణాకర్, ఏసీపీలు సంపత్‌రావు, శివరామయ్య ఆధ్వర్యంలో తొలుత నచ్చజెప్పారు. ఎంతకూ వినకపోవడంతో పంచాయతీ కార్యదర్శులను నెట్టివేస్తూ అంతిమయాత్రను ముందుకు సాగించారు.

నినాదాల నడుమ అంతిమయాత్ర

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నినాదాలు, చప్పట్ల నడుమ అంతిమయాత్ర కొనసాగింది. పాకాలరోడ్డు సెంటర్, అంబేడ్కర్ సెంటర్‌లో నినాదాలు చేస్తూ పంచాయతీ కార్యదర్శులు బైఠాయించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని అంతిమయాత్రను వైకుంఠధామం వరకు తీసుకెళ్లారు. అక్కడ సైతం పంచాయతీ కార్యదర్శులు కాష్టం చుట్టూ నిల్చొని నినాదాలు చేశారు. జేపీఎస్ లను రెగ్యులర్‌చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



సోని ఇంటి ఎదుట బైఠాయించిన పంచాయతీ కార్యదర్శులు

పలువురి పరామర్శ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర నాయకులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, గటిక అజయ్, ఏఐసీసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జనసేన నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మేర్గు శివ, జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ జావీద్, జిల్లా అధ్యక్షుడు గుంటి రాంచందర్, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కని సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, బొల్లంపల్లి సారయ్య, శనిగరజు రాజు, డ్యాగల శ్రీనివాస్ సోనీ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వైకుంఠధామంలో కాష్టం చుట్టూ కార్యదర్శుల నినాదాలు



తల్లిని సన్మానించి కేక్ తినిపిస్తున్న దంపతులు దాసరి రాములు, ఈశ్వరమ్మ(ఫైల్)

తల్లిలో కూతురిని చూసుకుంటూ..

మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ హరిజనవాడకు చెందిన దాసరి రాములుకు ముగ్గురు కుమారులు. కూతుళ్లు లేక పోవడంతో తల్లినే తన కూతురిగా భావించి తల్లిపై ప్రేమను పంచుతున్నాడు. ప్రతీ ఏటా వేసవిలో గురవమ్మ కాళ్లు కడిగి బహుమతులు అందిస్తున్నాడు. పండుగ వాతావరణంలో ఆమెను సన్మానిస్తున్నాడు. గురవమ్మ, గురవయ్య దంపతులకు ఏడుగురు సంతానం. ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే గురువయ్య మృతి చెందాడు. తండ్రి లేని లోటు తెలియకుండా కష్టపడి పెంచి వివాహాలు చేసింది. చిన్న కుమారుడైన రాములు స్థానికంగా రేషన్ డీలర్‌గా ఉన్నాడు. 35 ఏళ్లుగా తల్లి యోగక్షేమాలు చూస్తూ ప్రతీ వేసవిలో కుటుంబ సభ్యులు స్థానికుల మధ్య పండుగ వాతావరణంలో రాములు తన తల్లిని సన్మానిస్తున్నాడు. ఎన్ని జన్మలెత్తినా తల్లి రుణం తీర్చలేనిదని రాములు చెబుతున్నాడు. 88 ఏళ్ల వయసులోనూ తల్లిని కూతురిలా చూసుకుంటున్న రాములు నేటి తరానికి ఆదర్శం.

ప్రేమతో.. 'అమ్మ' హాస్పిటల్



డాక్టర్ హిమబిందు

నర్సంపేట: అమ్మపై ప్రేమను చాటుకునేందుకు ఏకంగా 'అమ్మ' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌నే ప్రారంభించారు చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ హిమబిందు. తన తల్లి లక్ష్మి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగి. చిన్నతనం నుంచే డాక్టర్ కావాలని చెబుతూ వచ్చారు. అమ్మ కలలకు అనుగుణంగా హిమబిందు ఉన్నతంగా చదివి డాక్టరై హాస్పిటల్ ప్రారంభించారు. తన ఇద్దరు కుమారులకు ప్రేమను పంచుతూ వైద్యం కోసం వచ్చే ఎంతో మందికి ప్రేమను పంచడంలో డాక్టర్ హిమబిందు సఫలీకృతులయ్యారు.

అమ్మ.. సృష్టిలో ఇంతకుమించిన పదం, ఇంతకు మించిన బంధం మరోటిలేదంటే అతిశయోక్తి కాదు. పురిటినొప్పుల బాధను పంటిబిగువున పట్టి.. రక్తపుగుడ్డుకు జన్మనిచ్చి ఆజన్మాంతం కంటికి రెప్పలా కాపాడే దైవం.. అమ్మ. పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడి, సాంకేతికత వినియోగంతో బిజీగా మారిన ప్రస్తుత మానవ జీవన ప్రయాణంలో సైతం జన్మనిచ్చిన తల్లి రుణం తీర్చుకునేందుకు కొంతమంది పరితపిస్తూనే ఉన్నారు.. అలాంటి వారికి సలాం చేస్తూ.. ప్రేమను తప్ప ద్వేషాన్ని పంచడం తెలియని అమ్మకు నీరాజనం పలుకుతూ.. అమ్మ పేరుతో సేవ చేస్తున్న వారిని 'నేడు మాతృదినోత్సవం' సందర్భంగా పరిచయం చేసే ప్రయత్నమే ఈ కథనం.

అమ్మకు నీరాజనం

మాతృ దినోత్సవం



- తరాలు మారినా తరగని ప్రేమ తల్లిది
- నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

అనాథ పిల్లలకు అమ్మగా...

జనగామ: అనాథ పిల్లలకు అమ్మగా అప్యాయతను పంచుతూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తూ వారి పిల్లలకు అమ్మమ్మగా కుటుంబ ప్రేమను చాటిచెబుతున్న మాజీ మావోయిస్టు. సామాజిక సేవాకర్త కత్తుల లక్ష్మీరవీందర్ అభాగ్యులను చేరదీస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం రామన్న గూడెంకు చెందిన కత్తుల లక్ష్మి, ఆమె భర్త రవీందర్ గతంలో మావోయిస్ట్ పార్టీలో పని చేశారు. ఓ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునే సమయంలో పోలీసులు అరెస్ట్ చేయడంతో 3 ఏళ్ల పాటు జైలు జీవితం గడిపారు. అనంతరం జనగామ జిల్లా కేంద్రంలో 2017లో వర్ధన్ అనాథ ఆశ్రమాన్ని స్థాపించి, అనాథ పిల్లలను చేరదీస్తున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు అమ్మ ప్రేమను పంచుతూ.. కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 3 వందల మంది పిల్లలు డిగ్రీవరకు చదివి ఉన్నతస్థాయిలో ఉండగా.. మరో 20మందికి వివాహం చేశారు. ప్రస్తుతం 30 మంది అనాథ పిల్లలకు దాతల సహాయంతో ఆశ్రయం కల్పించి సేవ చేస్తున్నారు.



చిన్నారికి గోరుముద్దలు తినిపిస్తున్న లక్ష్మి

అమ్మను స్మరిస్తూ.. సేవ చేస్తూ..



ఇనుగుర్తి జెడ్పీఎస్ఎస్‌లో అమ్మా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేస్తూ.. (ఫైల్)

కేసముద్రం: కని, పెంచిన తల్లి కానరానిలోకాలకు వెళ్లిపోగా.. ఆమెను స్మరిస్తూ ప్రజాసేవ చేస్తూ అమ్మను అందరి హృదయాల్లో బతికిస్తున్నాడు.. మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన గంజి శ్రీనివాస్‌రెడ్డి. గ్రామానికి చెందిన గంజి ఉపేంద్రమ్మ, ముకుందరెడ్డి దంపతులకు కూతురు, ఇద్దరు కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్టారెడ్డి ఉన్నారు. ఈ క్రమంలో 2020 మార్చి 23న ఉపేంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గంజి శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యుల సహకారంతో, 2021 సంవత్సరంలో విజయదశమి రోజున అమ్మా చారిటబుల్ ట్రస్టును స్థాపించారు. ఆ రోజు నుంచి నేటి వరకు సమాజంలో పలు సేవా కార్యక్రమాలను చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లి పేరున స్మృతివనం ఏర్పాటు చేసి, 40 మామిడి చెట్లను పెంచుతున్నారు.

పుష్కర కాలంగా విశేష సేవలు



అనాథాశ్రమంలో వృద్ధులతో యాకుబీ(ఫైల్)

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో పుష్కర కాలంగా సహృదయ అనాథ వృద్ధాశ్రమం నిర్వహిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఎండీ యాకుబీ. నా అనే వాళ్లు లేక రహదారులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో భిక్షాటన చేస్తుండే వారిని చూసి చలించిపోయిన యాకుబీ భర్త చోటు సాయంతో ఆశ్రమాన్ని స్థాపించింది. ఆదిలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ మొక్కవోని ధైర్యంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తోంది. కరోనా కష్టకాలంలోనూ వృద్ధులను కంటికిరెప్పలా కాపాడిన యాకుబీ సేవలను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులు వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందితే యాకుబీ కన్న కొడుకులా మారి ఆయా వ్యక్తుల సంప్రదాయాల ప్రకారం తల కొరవి పెట్టి అంత్యక్రియలు నిర్వహించి, అభినందనలు అందుకుంటుంది.

ప్రజల కోసం పారిజాతా సేవాట్రస్ట్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాలె యోగీశ్వర్‌రావు తన తల్లి పేరుతో 'పారిజాత సేవా ట్రస్టు'ను ఏర్పాటు చేసి 17 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండాలోని దైవకృపా అనాథ శరణాలయం విద్యార్థులకు ప్రతి ఏడాది ఒక రోజు ఆతిథ్యం. శరణాలయ విద్యార్థులకు దుస్తులు, సీలింగ్ ఫ్యాన్లు బహూకరించడం జరిగింది. 2007లో మానుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథాలయానికి రూ.25వేల విలువల గల పుస్తకాలను అందించారు. 2009లో మానుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు 200 మందికి స్పైన్‌ఫ్లూ హోమియో మాత్రలు పంపిణీ చేశారు. 2010లో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారు. 20 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. 2011లో కొత్తూరు తండాలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు దుస్తులు, వంట సామగ్రి పంపిణీ చేశారు. 2014లో తాండవకృష్ణ నృత్య అకాడమి సహకారంతో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహించి 75 మంది విద్యార్థినులను సత్కరించారు. 2015లో మానుకోట గ్రామ పంచాయతీ సిబ్బందికి గొడుగులు పంపిణీ చేశారు. పైన పేర్కొన్న కార్యక్రమాలే కాకుండా సద్దుల బతుకమ్మ రోజున మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్నారు. ప్రతి ఏడాది కార్తీకమాస కోటి దీపోత్సవం, భాగవత, రామాయణ ప్రవచనాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పారిజాత సేవా ట్రస్ట్ బాధ్యులు(ఫైల్)

వృద్ధాశ్రమంలో అమ్మలాంటి ఆదరణ



ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగులు, వృద్ధులతో సిస్టర్స్

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ అన్స్ హోమ్ ఫర్ ద ఏజ్డ్ అండ్ డిసెబుల్డ్ ఆశ్రమం దివ్యాంగులు, వృద్ధులకు సేవలు అందిస్తుంది. ఫాతిమానగర్‌లో 1967వ సంవత్సరంలో సెయింట్ అన్స్ హోమ్ ఫర్ ద ఏజ్డ్ అండ్ డిసెబుల్డ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఈ ఆశ్రమం ఎవరూ లేని వారికి ఆశ్రయం కల్పించి ఆలన పాలన చూస్తుంది. ఆశ్రమంలో ప్రస్తుతం 40 మంది ఆశ్రమం పొందుతున్నారు. ఆశ్రమం కరస్పాండెంట్ సోఫియా, సిస్టర్స్ మ్యాథ్యు, నిర్మలా, సినిలు అన్ని తామై మానసిక దివ్యాంగులు, వృద్ధులకు సేవలు అందిస్తున్నారు.

'వృత్తి అమ్మ'తో సమానం



పిల్లలు, భర్త శశిధర్‌రెడ్డితో డాక్టర్ సింధూరరెడ్డి

నర్సంపేట: వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిలో ఎండీ డీజీఓగా విధులు నిర్వహిస్తున్నారు సింధూరరెడ్డి. ఓ వైపు అమ్మగా మూడేళ్లు దాటని తన ఇద్దరు పిల్లలకు ప్రేమను పంచుతూనే మరోవైపు డాక్టరమ్మగా రోగులకు సేవలందిస్తున్నారు. వైద్య వృత్తి అమ్మతో సమానమని వృత్తి విషయంలో ఎప్పుడూ నిర్లక్ష్యం చేయనని ఆమె చెబుతున్నారు. కాగా.. సింధూరారెడ్డి భర్త శశిధర్‌రెడ్డి సైతం వైద్య వృత్తిలో ఉన్నారు. దంపతులిద్దరూ బిజీగా గడుపుతున్నప్పటికీ సింధూరారెడ్డి పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఎన్పీడీసీఎల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఈశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్పీడీసీఎల్ శాఖ నాయకులు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్మికులు అనేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నారని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లో టీఎస్ యూఈఈయూ టీఎస్ ఎన్పీడీసీఎల్ స్థాయి సమావేశంలో ఈశ్వర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లోని ఉద్యోగుల సమస్యల సాధనకై ఈ నెల 25న ఎన్పీడీసీఎల్ అధికారులను కోరుతామని చెప్పారు. సమావేశంలో టీఎస్ యూఈఈయూ ఎన్పీడీసీఎల్ శాఖ గౌరవాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి, అధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి ప్రసాద్, స్వామి, రమేష్, వెంకటేష్, శ్రీనివాస్, శివ, శ్రీకాంత్, రాఘవేంద్రరావు ఉన్నారు.

లారీ ఓనర్ల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో లారీ ఓనర్ల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్ అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలోని ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో న్యూ కాకతీయ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఎన్నికైన వారిలో సాండ్ లారీ ఓనర్స్ అధ్యక్షుడు చంచు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయుడు, కోశాధికారి సుమన్, వర్కింగ్ ప్రసిడెంట్ పోతురాజు, ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, ఎండీ గౌస్, రవీందర్, ప్రభాకర్ రెడ్డి, రవికిషోర్, విక్రమ్‌గౌడ్, సహాయ కార్యదర్శులు రమేష్, మధుసూదన్, గౌరవ సలహాదారులు గెంట్యాల వీరస్వామి, కరుణాకర్, రవీందర్, కుమారస్వామి, ఆర్గనైజర్ సెక్రటరీ శ్రీధర్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, సోమన్న, జాకీర్ హుస్సేన్, బి.కిషోర్, నరేష్, సంపత్‌రావు, కోటి,దుర్గారాజు, రమేష్, నాగరాజు, రమేష్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీఏ(ఎల్.) బీబీఏ, బీకామ్, బీఎస్సీ నాల్గవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ నరేందర్‌లు శనివారం విడుదల చేశారు. ఇప్పటికే రెండుసార్లు టైం టేబుల్‌ను విడుదల చేసిన అధికారులు మళ్లీ మార్పులు చేశారు. ఇతర సెట్ల పరీక్షలు ఉండటంతో మళ్లీ తేదీలను వెల్లడించారు. డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి 23, 29, 31, జూన్ 3, 6, 8, 12, 14, 16, 19 తేదీల్లో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు నిర్వహిస్తారు. డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22, 24, 30, జూన్ 1, 5, 7, 9, 13, 15, 17, 20, 21,22, 23,24 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటవరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సంబంధిత కేయూవెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

టీచర్ ట్రైనింగ్

ప్రముఖ పబ్లికేషన్స్‌లో పనిచేయుటకు టీచర్ ట్రైనర్స్ కావలెను. ఆడ వారికి ప్రాధాన్యత Degree Fluence in English Teaching Experience, Place: WGL, HNK, KZP, PRKL. Cell: 9676591600. [W-785559]

TEACHER TRINING

మహిళలకు శుభవార్త! Pre Primary Teachers Training (PPTTC) లో ఉచిత శిక్షణ (Exam Fee) సర్టిఫికేట్‌తోపాటు ఉద్యోగం పొందండి. (Sunday Classes). Cell: 9000668448. [W-785538]

FREE HR TRAINING

PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతితో HR+మీడియా+ డిజి॥ మా॥+అకౌంట్స్+కం॥120 డేస్ ట్రైనింగ్, తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం, డిగ్రీ, స్మార్ట్ ఫోన్ మస్ట్.9032944447 [HA-5738]

REAL ESTATE

FLAT FOR SALE

KUDA కాలనీ, 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27023]

LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3219]

2 BHK Semi Furnished Ready to Occupy new flats for sale in TNGO's Colony, Near Shyamala Gardens, 100 Ft. Road, Waddepally, HNK, Wgl. Cell: 98662 95406. [M-9373]

2 & 3 BHK Luxury Flats for Sale Behind Circute House & Vikas Nagar Road No. 11, Loan Facility available. Cont.: 73823 32244, 77993 20832 [M-9384]

HOUSE FOR SALE

ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27025]

వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-27027]

ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27029]

REAL ESTATE

వరంగల్ నుండి 18 కి.మీ. దూరంలో కేవలం 7 లక్షలకే 200 చ॥గ॥ల రిజిస్ట్రేషన్ ప్లాటు (E/F) అమ్మబడును. వివరాలకు సంప్ర॥ సెల్: 9573689941 [M-9453]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-785498]

ICE CREAMS

Igloo Ice Cream Adalath HNK. వివాహ శుభ కార్యములకు ఐస్‌క్రీమ్ సప్లయి చేయబడును. సంప్ర॥ పాలం వేణుగోపాల్ రెడ్డి. 9849165892.PRR. 9849375236. [WA-6958]

BUSINESS OFFER

ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9310515624, 8800496710 [DA-36266]

OLD AGE HOME

మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781615]

WANTED

Urgent Requirement for female Telecallers in Corporate Finance Office Job location Hanamkonda. Qualification: 12th/ Degree + Well Talking Skills Please Contact: +918886501552. [WA-6965]

Kamalatmika Poultry is looking for the following positions in Warangal. 1) Accountant 2) Store Supervisor. Exp. is mandatory in the same domain. Attractive Salary & Bonus. 8106112401 [W-785552]

వరంగల్‌లోని కిరాణం షాప్ నందు పని చేయుటకు 3 సం॥ అనుభవం కల్గిన (స్త్రీ/పు) కావలెను. వరంగల్ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి. యువరాజ్ కిరాణం, వరంగల్. 9490133696 [W-785555]

Govt. LIC of India లో అడ్వైజర్‌గా కమీషన్, సాలరీ పై పనిచేయుటకు Male/ Female పార్ట్‌టైం/ ఫుల్‌టైం పనిచేయుటకు సంప్రదించండి: సెల్: 9848073605 [WA-2965]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1190695]

ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు సంప్ర: 8341371684. [G-786303]

విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

అనుభవం గల ఫోటోషాప్ డిజైనర్ & ఫ్లెక్స్ ప్రింటింగ్ ఆపరేటర్ జీతం: 15K-25K చిన్న ఫ్లెక్స్ ప్రింటింగ్, అశోక్‌నగర్, Hyd. 9848234571 [HA-93088]

సెక్యూరిటీ గార్డ్స్, సె॥సూపర్‌వైజర్, కా॥ L.B. నగర్, ఘట్‌కేసర్, బాచుపల్లి, కొల్లూర్, జీడిమెట్ల, కాజగూడ & ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ కా॥ మంచి జీతం. మెట్రో మేనేజ్‌మెంట్. ఫోన్: 9885657755, 9963077722. [H-781417]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K-18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [H-793423]

Need M/F Who Are Good At ENG Speaking, as PRI & HS Spoken ENG Trainers. Experience, not a must. Free Training by CFEL. Sal 20 - 30K. Ph: 8919641609 [H-781477]

WANTED TEACHERS

Wanted Qualified Teachers and PET's for Nursery to VII Class (All Subjects) Contact: Cell: 7416744459, 7416744469. [W-1002199]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.